
A1TV NEWS

నేటి ఆంధ్రప్రగతి
APTEL 2023/16425
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి
నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ
పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు
ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)
సెల్: 8121133006
9494220260
ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంచిక :01 సంపుటి : 170 ఆదివారం 21 జనవరి 2024 పేజీలు 4. వేల :4 /



# వైసీపీ పాలనలో ఏ ఒక్కరూ ఆనందంగా లేరు

## - చంద్రబాబు.


ఆంధ్ర ప్రగతి అరకు/ మండపేట జనవరి 20

టీడీపీ అరకు కాఫీని ప్రపంచానికి పరిచయం చేస్తే, వైసీపీ గంజాయిని పరిచయం చేసిందని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. శనివారం అల్లూరి జిల్లా అరకులో 'రా...కదలి రా' కార్యక్రమంలో చంద్రబాబు ప్రసంగించారు.అరకులో రా కదలిరా బహిరంగసభలో మాట్లాడారు. పోలవరం ప్రాంతం ఏలూరు జిల్లా పరిధిలో ఉండగా, మరో గిరిజన ప్రాంతమైన రంపచోడవరం నియోజకవర్గం అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉంది. ఆయా ప్రాంత గిరిజనులు ప్రస్తుతం జిల్లా కేంద్రమైన పాడేరుకు కార్యాలయ పనుల కోసం రావాలంటే కనీసం 200 కిలో మీటర్లకు పైగా ప్రయాణించాల్సి రావడం కష్టమవుతోంది. అందుకే గిరిజనులు కొంత కాలంగా ఈ డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్ ను తీరుస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

అరకులో రా కదలిరా సభలో చంద్రబాబు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. గిరిజనుల కోసం గతంలో ప్రభుత్వం ప్రత్యేకంగా తీసుకొచ్చిన 16 పథకాలను వైకాపా ప్రభుత్వం రద్దు చేసిందని చంద్రబాబు అన్నారు. గిరిజన ప్రాంతాల్లోని ఉద్యోగాలు స్థానికులకే ఇచ్చేలా జీవో నెంబర్ 3ను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. నమ్మించి గొంతు కోసిన వ్యక్తి జగన్ అని మండిపడ్డారు. గిరిజనుల సంపదను దోచుకున్నారని ఆరోపించారు. ఎంతో ప్రత్యేకత కలిగిన అరకు కాఫీని ప్రపంచానికి పరిచయం చేయాలని తెదేపా అధినేత, ఏపీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దావోస్కు ఇప్పటికే అరకు కాఫీ రుచి చూపించామన్నారు. అరకు కాఫీని తాము ప్రమోట్ చేస్తే.. జగన్ గంజాయిని పరిచయం చేస్తోందని మండిపడ్డారు.

గిరిజనుల పొట్టకొట్టే ప్రభుత్వం వైసీపీదని..గిరిజన ప్రాంతాల్లోని ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని సంకల్పించా జగన్ అడ్డుపడ్డారన్నారు. గిరిజనుల పిల్లలు చదువుకోవడం జగన్కు ఇష్టం లేదన్నారు. అందుకే ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం రద్దు చేశారు. ప్రపంచంలో ఎక్కడ చదివినా గిరిజనులకు స్కాలర్షిప్పులు ఇస్తే.. దాన్నీ తీసేశారు. నైపుణ్యం కోసం శిక్షణ కేంద్రాలు పెడితే వాటినీ ఊడగొట్టారు. గిరిపుత్రిక కల్యాణ పథకాన్నీ రద్దు చేశారు. గిరిజనులకు 50 ఏళ్లకే పింఛన్ ఇచ్చిన ఘనత తెదేపాది. గిరిజనుల సహజ సంపదను దోచుకునే వ్యక్తి జగన్" అని చంద్రబాబు మండిపడ్డారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగించారు. మంచినీరు అడిగితే కొబ్బరి నీరు ఇచ్చే మంచి మనసున్న వారు ఇక్కడి ప్రజలు అని ఆయన అన్నారు. ప్రశాంతమైన కోనసీమలాంటి ప్రాంతంలోనూ చిచ్చు పెట్టారని.. అరాచకాలు, దాడులు, కేసులు నమోదవుతున్నాయని చంద్రబాబు వెల్లడించారు. వైకాపా పాలనలో ఏ ఒక్కరూ ఆనందంగా లేరన్నారు. రైతులు, రైతు కూలీలూ, చిన్న వ్యాపారులు, ఉద్యోగులు, గుత్తేదారులు ఎవరూ ఆనందంగా లేరన్నారు. దగాపడ్డ ప్రజల్ని కాపాడుకోవడం కోసం రా కదలి రా అని పిలుపు ఇచ్చామన్నారు.

ఆక్వా రైతు నిండా మునిగారు, ధాన్యం రైతు దగా పడ్డారని.. గంజాయి రైతు మాత్రం ఆనందంగా ఉన్నారని చంద్రబాబు విమర్శించారు. ధాన్యం కొనే వారు లేరన్న ఆయన.. అరకొరగా డబ్బులు ఇచ్చారన్నారు. పోలవరం 72 శాతం పూర్తి చేశామన్న ఆయన.. పోలవరం పూర్తయితే రైతులకు నీటి సమస్య తీరేదన్నారు. ఆక్వా రైతులు చితికిపోయారని ఆయన చెప్పారు. చంద్రబాబు మాట్లాడుతూ.. "100 సంక్షేమ పథకాలకు కోతపెట్టారు. రు .10 రూ ఇచ్చి 100 దోచుకుంటున్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచారు. నాసిరకం మద్యం తాగి 35 లక్షలమంది ఆరోగ్యం దెబ్బతింది. 30 వేల మంది చనిపోయారు. సీఎం ధన దాహానికి జనం బలైపోయారు. బీసీలకు ఏడాదికి 15 వేలు ఖర్చు పెడతామన్నారు. ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. ఇసుక రేట్లు విపరీతంగా పెంచేశారు. ఇసుక దోపిడీ



చేస్తున్నారు. సమాజ సంపదను దోచుకుంటున్నారు. 40 లక్షల మంది తాపీ వర్కర్లు ఉపాధి కోల్పోయారు. కాపులకు పది రూపాయలు కూడా ఇవ్వలేదు. మీరు ఐదేళ్లు దోపిడీ చేసి నెపం ఎమ్మెల్యేలపై వేస్తున్నారు. రెడ్లకు కూడా న్యాయం జరగలేదు. 95 వేల కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టారు. 40 మంది గుత్తేదారులు ఆత్మహత్య చేసుకున్నారు. ఎమ్మెల్యేలు, మంత్రుల్ని బదిలీ చేస్తున్నారు. నా జీవితంలో ఇలాంటి బదిలీలు చూడలేదు. దళిత నాయకులతో మాట్లాడరు, వారిని కలవరు, వారిని నించోబెట్టి అవమానించారు. సీఎం ఎప్పుడూ తప్పులు మీద తప్పులు చేస్తూ అందర్నీ మోసం చేస్తున్నారు. అంటరానితనం నిర్మూలనకు 12 జీవోలు తెచ్చిన పార్టీ టీడీపీ." అని చంద్రబాబు అన్నారు.

అంబేద్కర్ పేరు తలవడానికి, విగ్రహాలు పెట్టడానికి జగన్‌కు అర్హత లేదన్నారు టీడీపీ అధినేత చంద్రబాబు. చంద్రబాబు మాట్లాడుతూ.." వచ్చేది తెదేపా- జనసేన ప్రభుత్వమే. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. మండపేట వైకాపా ఇంఛార్జ్ చాలా తెలివైనవాడు. అధికారం ఎక్కడ ఉంటే ఈయన అక్కడ ఉంటారుఅరాచకవాది, రౌడీయిజం చేస్తారు. ఆయారాం.. గయారాంలను రానీయం. ఇసుక, గ్రావెల్, మైనింగ్ ద్వారా 500 కోట్లు దోచేశారు. దళితులపై కేసులు పెట్టించారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే జోగేశ్వరరావుని మళ్లీ గెలిపించాలి." అని చంద్రబాబు కోరారు.



# చంద్రబాబు హెలికాప్టర్లో సమన్వయ లోపం.

## . హెచ్చరించిన ఏటీసీ అధికారులు.

ఆంధ్ర ప్రగతి విశాఖపట్నం జనవరి 20:

విశాఖ నుంచి అరకు సభకు వెళ్తున్న చంద్రబాబు హెలికాప్టర్?లో సమన్వయ లోపం తలెత్తింది. ఏటీసీతో పైలట్‌కు సమన్వయ లోపం ఏర్పడింది. నిర్దేశించిన మార్గంలో కాకుండా వేరొక మార్గంలో ప్రయాణించిన హెలికాప్టర్?. పైలట్ రాంగ్‌రూట్‌లో వెళ్తున్నట్టు హెచ్చరించిన ఏటీసీ అధికారులు. ఏటీసీ హెచ్చరికలతో హెలికాప్టర్ వెనుదిరిగింది. కొంత సమయం తరువాత మళ్లీ సరైన మార్గంలో వెళ్లేందుకు ఏటీసీ అనుమతి లభించింది.తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా భారీ బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. గత రెండు రోజుల క్రితం గుడివాడలో సభ జరుగగా శనివారం అరకులో పార్లమెంటర్ నియోజకవర్గంలో సభను నిర్వహించారు. ఈ సభకు హాజరయ్యే క్రమంలో విశాఖ నుంచి అరకు బయలుదేరారు. ఈ క్రమంలోనే ఈఘటన తలెత్తింది.

# అన్ని దారులు అయోధ్య వైపే..


# అంతా రామమయం..!

ఆంధ్ర ప్రగతి అయోధ్య జనవరి 20:

22 జనవరి 2024 ఉషోదయ భానుడి కిరణాలు తొంగి చూస్తున్న శుభ వేళ సూర్యవంశ అయోధ్య శ్రీ రాముడిని దివ్యమైన, భవ్యమైన గర్భగుడిలో భక్తిపూర్వక ప్రాణ ప్రతిష్ట, ప్రారంభోత్సవం చేయడానికి మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రానున్న విషయం భారతీయులకు అందరికీ పరమానందాల్ని తోడ్కొని వస్తున్నది.దేశ స్వాతంత్ర్యానంతరం నిర్మించిన అత్యద్భుతమైన అతి పెద్ద మందిరంగా శ్రీరాముడి జన్మ స్థలం అయోధ్యలో భరతవంశాకురం రామయ్య కొలువు తీరనున్నారనే వార్త హిందూ బంధువులతో పాటు అందరినీ పులకరింపులకు గురిచేస్తున్నది.

05,ఆగస్ట్ 2020 భూమి పూజ

05 ఆగష్టు 2020న ప్రారంభమైన అయోధ్య రామమందిర నిర్మాణంలో డిజిటల్ టెక్నాలజీని జోడిస్తూ సనాతన భారతీయ సంస్కృతులను అనుసరించి రికార్డు సమయంలో నిర్మించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. రాముడి జన్మ భూమిలోని సీతారాముల మందిర స్థలంలో



1528 – 29 కాలంలో మొగల్ రాజు బాబర్ ద్వారా బాబ్రీ మసీదు కట్టాడని హిందూ సంఘాలు వందల సంవత్సరాలుగా పోరాటం చేయడం, 06 డిసెంబర్ 1992న కరసేవకులు మసీదును కూల్చడానికి పూనుకోవడం లాంటి ఘటనలు సమసిపోయి 09 నవంబర్ 2019న కోర్టు తీర్పుతో అదే ప్రాంగణంలోని 2.77 ఎకరాల రాముడి నడయాడిన పుణ్య స్థలంలో శాంతియుత వాతావరణంలో నేడు అత్యద్భుత రామ మందిరం నిర్మించబడడం హర్షదాయకం.ప్రపంచంలోనే 3వ అతి పెద్ద హిందూ దేవాలయం





# 500 కోసం ఆత్మహత్య చేసుకున్న భార్యాభర్తలు.

ఆంధ్ర ప్రగతి అమరావతి జనవరి 20:

ఏపీలోని కృష్ణా జిల్లా గుడివాడ పట్టణంలో కేవలం రూ.500 రూపాయల కోసం భార్యాభర్తలు గొడవపడి ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన చోటు చేసుకుంది.స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు గుడివాడలోని వాసవీ నగర్లో నివాసముంటున్న కొలుసు రాంబాబు, కనకదుర్గ దంపతులు. శనివారం మధ్యాహ్నం రూ.500 కోసం ఇద్దరూ గొడవ పడ్డారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన భార్య కనకదుర్గ ముందుగా ఇంట్లో ఉరివేసుకుని చనిపోగా, విషయం తెలుసుకున్న భర్త రాంబాబు మరో గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు.



# వైయస్సార్ ఆశయాల కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరా.!

ఆంధ్ర ప్రగతి కడప జనవరి 20: వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాల కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరానని వైఎస్ షర్మిల అన్నారు. ఏపీ పీసీసీ అధ్యక్షురాలిగా ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో శనివారం సాయంత్రం ఇడుపులపాయలోని వైఎస్ రాజశేఖర్ రెడ్డి సమాధి వద్ద వైఎస్ షర్మిల నివాళు లర్పించారు.రేపు విజయవాడలో ఏపీ పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు తీసుకునే ముందు నాన్న ఆశీర్వాదం తీసుకున్నానని వైఎస్ షర్మిల తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాల కోసం, వైఎస్సార్ ఆశయాల కోసం కాంగ్రెస్ పార్టీ కోసం కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసే వరకు పోరాటం ఆగదని షర్మిల వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాన్ని నిలబెట్టిన వ్యక్తి రాజశేఖర్ రెడ్డి అంటూ ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా షర్మిల సమక్షంలో మాజీ మంత్రి అహ్మదుల్లా కాంగ్రెస్ పార్టీలో చేరారు. తన రాజకీయ గురువు రాజశేఖర్ రెడ్డి కోసం కాంగ్రెస్‌లో చేరినట్లు అహ్మదుల్లా తెలిపారు.

కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ రామచంద్రరావు మాట్లాడుతూ.."వైఎస్ కుటుంబంతో నాకు మంచి సాన్నిహిత్యం ఉంది. ఇద్దరి కుటుంబాలు ఒకే బాటలో నడిచాయి. రాజకీయ విభేదాలు ఉన్నా సాన్నిహిత్యం వీడలేదు. వైఎస్ షర్మిల మేనకోడలు మాత్రమే కాదు కూతురితో సమానం. కాంగ్రెస్ పార్టీకి దిక్సూచిగా షర్మిల నిలబడి దేశంలో అగ్రగామిగా నిలబెట్టిన రాజశేఖర్ రెడ్డి బిడ్డని అందరూ సపోర్ట్ చేయాల్సిన అవసరం ఉంది. తండ్రి మాట కోసం నిలబడిన వ్యక్తి వైఎస్ షర్మిల. రాజశేఖర్ రెడ్డి ఆత్మాభిమానూలు షర్మిలపై ఉండాలి.. రాష్ట్రంలో పూర్వ వైభవం షర్మిలతో సాధ్యం అవుతుంది. " అని కేవీపీ అన్నారు. మాజీ మంత్రి రఘువీరారెడ్డి మాట్లాడుతూ.."రాహుల్ ప్రధాని కావాలన్న కోరిక కోసమే షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరారు ఇది రాజశేఖర్ రెడ్డి కల. షర్మిల రాకతో కాంగ్రెస్ పార్టీ మళ్లీ పురుడు పోసుకుంటుంది. మాజీ నేతలంతా తన వెంట నడవడానికి సిద్ధం. రాష్ట్రం హక్కులు సాధించడంలో షర్మిల పాత్ర కీలకం కావాలి. ఎర్రకోటలో కాంగ్రెస్ జెండా ఎగరాలి ఆ విధంగా అందరం కృషి చేస్తాము. అహ్మదుల్లా కాంగ్రెస్ పార్టీలో చేరడం సంతోషంగా ఉంది. వాళ్ళ కుటుంబం గతంలో చాలా భాధ్యతలు తీసుకొని పార్టీ కోసం కష్టపడ్డారు. అహ్మదుల్లా చేరిక ప్రారంభమే ఇంకా పార్టీలోకి చేరే వాళ్ళు చాలా మంది ఉన్నారు." అని ఆయన అన్నారు.



# గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించండి.

## -జిల్లా అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సమూన్.



ఆంధ్రప్రగతి నంద్యాల, జనవరి 20:
జిల్లాలో ఈనెల 26వ తేదీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా పెద్ద ఎత్తున చేపట్టేందుకు ఇప్పటినుండే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సమూన్ జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డిలతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సమూన్ మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటినుండే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కళాశాల మైదానాన్ని ఆకర్షణీయమైన రీతిలో తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. జాతీయ పతాక ఆవిష్కరణ, సాయుధ దళాల మార్చ్ ఫాస్ట్, వేదిక, బ్యాక్ డ్రాప్, విఐపి సీటింగ్ తదితర ఏర్పాట్లపై ప్రత్యేక చొరవ చూపాలని ఆర్డీఓ, పోలీసు అధికారులను ఆదేశించారు. దేశభక్తి ఉట్టిపడేలా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డిఇఓను కలెక్టర్ ఆదేశించారు. నవరత్నాల అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింభించేలా వ్యవసాయం, డిఆర్డిఏ, హౌసింగ్, వైద్యం, డ్వామా, వ్యవసాయ అనుబంధ రంగాలు, సంక్షేమం తదితర అన్ని సంక్షేమ శాఖలు అభివృద్ధి కార్యక్రమాలపై ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా అందరినీ ఆకట్టుకునేలా ఉండాలన్నారు. అలాగే ఆయా శాఖలు ఎగ్జిబిషన్ స్టాల్స్ ను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. జనవరి 26వ తేదీ నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా ప్రజలు, పాఠశాల విద్యార్థులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గత స్వాతంత్ర, గణతంత్ర దినోత్సవ వేడుకల్లో తలెత్తిన సూక్ష్మలోపాలను సైతం దృష్టిలో ఉంచుకొని ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా వేడుకల నిర్వహణపై సీరియస్ గా తీసుకోవాలని జిల్లాధికారులను ఆదేశించారు. వేడుకల నిర్వహణకు సంబంధించి అధికారులకు అప్పగించిన విధులను చివరి వరకు వుండకుండా ముందస్తుగా పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆహ్వాన పత్రికలను ప్రోటోకాల్ ప్రకారం ముందుగానే పంపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను ఆదేశించారు. అనంతరం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు పురస్కరించుకొని ఫ్లెక్సీ బ్యానర్లు, కరపత్రాలను జిల్లా కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్, రవాణా శాఖ అధికారి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, ఆర్డీవో శ్రీనివాసులు, డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి, డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, డిఎంహెచ్ఓ డా. వెంకటరమణ, డీఈవో సుధాకర్ రెడ్డి, రవాణా శాఖ అధికారి శివారెడ్డి, ఇతర జిల్లాధికారులు తదితరులు పాల్గొన్నారు

# కరువు పరిస్థితుల నేపథ్యంలో జిల్లా రైతాంగాన్ని ఆదుకోండి

## -జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగల భరత్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సమూన్.



ఆంధ్రప్రగతి నంద్యాల, జనవరి 20:
జిల్లాలో తీవ్ర వర్షాభావ కరవు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతాంగాన్ని అన్ని రకాల ఆదుకునేందుకు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులను సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ గారితో కలిసి జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మార్క్ ఫెడ్ చైర్మన్ పి.పి.నాగి రెడ్డి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు రాజమోహన్ రెడ్డి, వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు సమిష్టిగా కృషి చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఆరు మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రైతుల వేసిన పంటకు ఈ క్రాప్ బుకింగ్ తో పాటు పెండింగ్ లో ఉన్న ఈ కేవైసీని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగుకు ప్రభుత్వం అనుమతించిందని నర్సరీల్లో సంబంధిత ప్లాంటేషన్ కు చర్యలు తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారిని ఆదేశించారు. సాగునీటి కాలువలు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల పరివాహక ప్రాంతాలోని రైతులకు నీటి సౌకర్యం కల్పించి వేసుకున్న పంటలను కాపాడేందుకు ప్రయత్నించాలని సంబంధిత అధికారులను కోరారు. ఇన్పుట్ సబ్సిడీ ప్రీమియంపై రైతుల్లో ఆందోళన ఉందని ఈ అంశంపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులకు సూచించినప్పటికీ తీవ్ర నిర్లక్ష్యం చేశారని చైర్మన్ అసహనం వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు అలసత్వాన్ని విడనాడి రైతుల సంక్షేమానికి సంబంధించిన ప్రతి అంశాన్ని సీరియస్ గా తీసుకుని చురుకుగా పనిచేసి రైతులను ఆదుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు.
జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలానీ సమూన్ మాట్లాడుతూ రబీలో సాగు చేసుకున రైతులకు కరువు పరిస్థితులపై వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు, మండల వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే జొన్న పంట కొనుగోలు కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆర్బీకే లో పనిచేస్తున్న సిబ్బంది పనితీరు ఎలా వుందని సంబధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్రాప్ ఇన్సూరెన్స్ కింద ఈ సంవత్సరం ఖరీఫ్ కు 9 రకాల పంటలు మరియు రబీకు 6 రకాల పంటలకు వున్నాయని ఆర్బీకే ల ద్వారా గ్రామ సభలు నిర్వహించి రైతులకు అర్థమయ్యేలా ఏఏ పంటలకు ఎంత ఇన్సూరెన్స్ వస్తుందనే అంశాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమయ్యే విత్తనాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఏపీ సీడ్స్, మార్క్ఫెడ్ అధికారులను సూచించారు. రైతులకు అవసరమయ్యే సూచనలు సలహాలు ఇచ్చేందుకు వ్యవసాయ శాఖ ఏడీఏలు, గ్రామ వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, మార్కెటింగ్, మార్క్ఫెడ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు

# చెంచుగూడెంలో పాఠశాల భవనం ఏర్పాటు చేయాలి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 20:
గిరిజన విద్యార్థులకు విద్యాబోధన అందించడానికి ఉపాధ్యాయులు ఉన్నారు కానీ, పాఠశాల భవనం లేకపోవడం బాధాకరమని, ఆంధ్ర ప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్కు విజయవాడలో కలిసి వినతిపత్రం అందజేశారు. శనివారం విజయవాడ ఎస్టీ కమిషన్ కార్యాలయంలో చైర్మన్ డాక్టర్ శంకర్రావు, ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్ నాయకులను కలిసి గిరిజన విద్యార్థులు పడుతున్న అవస్థల గురించి క్లుప్తంగా వివరించి చెప్పారు. ఈ సందర్భంగా రాజు నాయక మాట్లాడుతూ..నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం అమలాపురం చెంచుగూడెం ఏర్పడి 20 సంవత్సరాలు అయింది అక్కడ వందలాదిమంది గిరిజనులు నివాసముంటున్నారు. నిరుపేద గిరిజనులు చదువుకోవడానికి ఇంతవరకు అక్కడ పాఠశాల ఏర్పాటు చేయలేదు. విద్యార్థులు ఉపాధ్యాయులను నియమించారే గాని పాఠశాల భవనం ఏర్పాటు చేయలేదన్నారు. రోజు ఒకచోట చెట్ల కింద రేకుల షెడ్ల కింద విద్యను అభ్యసిస్తున్నారు. ఐటీడీఏ అధికారులకు ఎన్నోమార్లు మొరపెట్టుకున్న పట్టించుకోని దాఖలాలు లేవన్నారు. అదేవిధంగా ఆ గూడెంలో అంగన్వాడి సెంటర్ మంజూరైన ఇంతవరకు అంగన్వాడి పాఠశాలను ఏర్పాటు చేయలేదు. నిరుపేద చెంచుల కోసం అంగన్వాడి కేంద్రాన్ని మంజూరు చేయాలని కోరారు. పిల్లలు చదువుకోవడానికి ముందుకొస్తున్న అక్కడ చదువు చెప్పడానికి ఉపాధ్యాయులు ఉన్న పాఠశాల లేకపోవడం చాలా బాధాకరమైన విషయం . ఆ గ్రామాన్ని జిల్లా అధికార యంత్రాంగం పర్యటించి అక్కడ గిరిజన పడుతున్న అవస్థలపై ఆరా తీసి నాడు నేడు కార్యక్రమం ద్వారా పాఠశాల మంజూరు చేయించి విద్యార్థులకు చక్కటి విద్యాబోధన అందించేందుకు కృషి చేయాలని కోరారు. 20 ఏళ్లుగా నరకయాతన అనుభవిస్తున్న విద్యార్థులకు పాఠశాల ఏర్పాటుతో మోక్షం కల్పించాలని కోరారు. ఆయనతోపాటు జిపిఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్., రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ నాయక్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శంకర్ నాయక్, రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు భాస్కర్ నాయక్, కడప జిల్లా అధ్యక్షుడు మరియు తదితరులు ఉన్నారు.



# అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రధాని నరేంద్ర మోడీ పోరాట ఫలితమే.

## -హిందూ బంధువుల ఇళ్లపై కాషాయం జెండా ఎగరాలి.

## -ఇంటింటికీ శ్రీరాముని క్యాలెండర్లు పంపిణీ.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 20:
అయోధ్యలో శ్రీరాముని మందిరం నిర్మాణానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పోరాట ఫలితమే అని నంద్యాల బిజెపి అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మదు పేర్కొన్నారు. శ్రీరామ బంటు అయిన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో అభిరుచి మదు, రాయలసీమ జోనల్ ధర్మ ప్రచార కర్త ఈశ్వర్ రెడ్డి, నంద్యాల జిల్లా ధర్మ ప్రచారక్ దాసరి శ్రీనివాసులు, వై ఎన్ రెడ్డి తదితరులు స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీరాముని క్యాలెండరు అవిస్కరించి ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్యలో శ్రీరాముని మందిరం కోసం 500 ఏళ్లు నిరీక్షణ చేశామని ,ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పలితంగా శ్రీరామ మందిరం నిర్మాణం జరిగిందని అన్నారు. అయోధ్యలో శ్రీరాముని మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా హిందువులు అంతా శ్రీరామ నామస్మరణ చేయాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో హిందువులు అందరూ ఇప్పటికే ఇంటి ముందు జై శ్రీరామ పేరును ముద్రించారు అన్నారు. ప్రతి ఇంటిపై కాషాయం జెండా ఎగురవేయాలని కోరారు. బైటీ పేటలో సమరసతా సేవా ఫౌండేషన్ నగర కన్వీనర్ చింతల పల్లె వాసు అధ్వర్యంలో అభిరుచి మదు ఇంటింటికీ తిరిగి కాషాయం జెండాలు, శ్రీరాముని క్యాలెండరులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి సహకరించిన దాతలు అభిరుచి మదు, గోళ్ల సుదర్శనం, కృష్ణ, రమేష్, కోట బాలిశెట్టి, ఓబులేసు, విశ్వనాథ్ సహకరించగా శ్రీరాముని క్యాలెండర్లు ఇంటింటికీ పంచు ఉడుతా భక్తిని చాటుకుంటామని నంద్యాల రోటరీ క్లబ్ అధ్యక్షులు దండే దస్తగిరి, సత్యం రెడ్డి, మాజీ కౌన్సిలర్ పినాక పాణి, సురేంద్ర, ఎల్లప్ప, రమేష్, నంద్యాల సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ రమేష్, బీజీపీ పట్టణ అధ్యక్షులు కసెట్టీ చంద్ర శేఖర్, గంజి వెంకటేశ్వర్లు, బాలు, మదు, తేజా, సంతోష్ లతో పాటు అధిక సంఖ్యలో క్యాలెండరు, కాషాయం జెండాలు పంపిణీ చేశారు.

# కాపు సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 20:
నంద్యాల గుడిపాడు గడ్డలో కాపు సంక్షేమ సేన 2024 నూతన సంవత్సర క్యాలెండర్ను కాపు సంక్షేమ సేన కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించడం జరిగింది. కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకులు జోగయ్య నాయకత్వాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తూ 80 పదుల వయసులో వృద్ధాప్యం లో కూడా సంఖ్యా బలం ఉండి కూడా రాజ్యాధికారానికి దూరంగా ఉన్నటువంటి కులాలను కలుపుకొని కాపు బలిజలు పెద్దన్న పాత్ర వహిస్తూ రాజ్యాధికారం సాధించడంలో జోగయ్య మార్గదర్శకాలను ముందుకు తీసుకెళుతున్నామని రాము అన్నారు. కాపు బలిజల ఐక్యమత్యాన్ని సంఘటితం చేస్తూ జోగయ్య గారి దిశా, నిర్దేశా లలో ప్రతి బలిజ సంఘీయులు భాగస్వామ్యం కావాలని రాము గారు అన్నారు ఈ కార్యక్రమంలో సంఘశివకుమార్ సంఘ జయంతి, సురేష్ కుమార్, బలచంద్రుడు, రంగు శ్రీను, భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# దళితుల ఇంటి స్థలములు దళితులకే ఇవ్వాలి.

## -చాబోలు గ్రామ దళిత మహిళలు.

ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ జనవరి 20:
నంద్యాల మండలం చాబోలు గ్రామంలో 1982లో ప్రభుత్వం మాలలకు ఇంటి స్థలములు ఇచ్చి ఉన్నారు వాటిలో గుడిసెలు వేసుకుని జీవిస్తుండగా 2019లో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పెట్రోల్ పోసి తగుల పెట్టి దళితులను భయభ్రాంతులకు గురిచేసి ఇండ్లను కాల్చడం జరిగింది. ఆనాటి నుండి ఆ స్థలాలను దళితులకు ఇవ్వాలని మహిళలు అనేక పోరాటాలు చేసి న్యాయం కోసం తిరగని చోటు లేకుండా అడగని అధికారులను అడగటం జరిగింది. శనివారం ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి , మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి ఇంటి దగ్గర కలిసి విషయం చెప్పుకోగా దళితులకు ఆ భూమిని దక్కే విధంగా చేస్తామని బలంగా హామీ ఇవ్వటం జరిగింది. అనంతరం ఈ రోజు నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సాముగ్,ని కలిసి దళిత ప్రజలు తమ సమస్యలను తెలుసుకోవడం జరిగింది. దళితుల ఇండ్ల సలాలు దళితులకే ఇవ్వాలని, విన్నవించుకోవడం జరిగింది. విచారణ చేసి న్యాయం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమం దళిత మహిళా సేన అధ్యక్షురాలు పరదేశి రోజు అక్క ఆధ్వర్యంలో జరిగింది రాష్ట్ర అధ్యక్షుడు న్యాయవాది కడియం సాంబశివుడు నాయకులు న్యాయవాది బి.ఆర్ అంబేద్కర్ యూత్ నాయకులు మరియు నాయకులు బండి చంద్రపాల్ ,జిల్లెల్ల శేఖర్ ,మహిళా నాయకురాలు పరిమళ రాణి ,చంద్రకళ ,మరియమ్మ సారమ్మ, దానమ్మ ,రాజు దానమయ్య ,రమేష్ ,లింగమయ్య శివశంకర్, అజయ్ ,శరత్ కుమార్ లు కలిసి కలెక్టర్ కి తమ గోడును విన్నవించుకోవడం జరిగినది



# టీడీపీ నాయకుల అసత్య ప్రచారాలు ప్రజలు నమ్మరు.

## - ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 20:
నంద్యాల నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని కళ్ళుండి చూడని టీడీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మరని ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి పేర్కొన్నారు. శనివారం నంద్యాల ఓల్డ్ టౌన్లోని 2వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా విడుదల చేసిన 20లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే 2,3,5 వార్డుల పరిదిలో షాలిన్ మసీద్ నుండి నడిగడ్డ వరకు 2కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రోడ్డు కొంత మేర నిర్మాణం చేపట్టవలసి ఉన్న నేపథ్యంలో ఆ రోడ్డును సంపూర్తి చేసేందుకుగాను 40 లక్షల నిధులను విడుదల చేసి భూమిపూజ నిర్వహించారు. త్వరలో రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాష, మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, కౌన్సిలర్లు సాధిక్, సమ్మద్, కలాం, ఆరిఫ్ నాయక్, తబ్రేజ్, కృష్ణమోహన్, కో ఆప్షన్ సభ్యులు పడకండ్ల సుబ్రమణ్యం, సలాముల్లా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వైఎస్సార్సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన స్వల్పవ్యవధిలోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. గత టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న 14 సంవత్సరాలలో చేసిన దాని కంటే వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో రెట్టింపు అభివృద్ధి చేశామని తెలిపారు. నంద్యాల నియోజకవర్గంలో తాము చేసిన అభివృద్ధిని కళ్లుండి చూడని టీడీపీ నాయకులు అభివృద్ధి జరగలేదని అసత్యపు ప్రచారాలు చేస్తుంటే వాటిని ప్రజలు నమ్మరని అన్నారు. నంద్యాల నియోజకవర్గం పరిదిలో దాదాపుగా 210 రోజుల పాటు ఎండవాన, చలి కాలాలను లెక్కచేయకుండా ప్రతి ఒక్క గడపకు వెళ్లానని, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని వాటిని సత్వరమే పరిష్కరించానన్నారు. ప్రతిపక్ష నాయకులు ఏనాడైనా ఈ విధంగా తిరిగారా అని సూటిగా ప్రశ్నిస్తున్నానన్నారు. కరోనా కష్ట సమయంలో తాను ప్రజల మద్యనే ఉంటూ వారికి సాయం అందించామన్నారు. తమను విమర్శిస్తున్న టీడీపీ నాయకులు నాడు ఎక్కడి వెళ్లారో ప్రజలకు చెప్పాలన్నారు. గత 14 సంవత్సరాలలో జరిగిన అభివృద్ధి, వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిపై తాను చర్చకు సిద్ధం అని ఛాలెంజ్ విసిరారు. నంద్యాల అభివృద్ధికి స్థలాలు దానం చేశామని గొప్పలు చెబుతున్న వారు ప్రభుత్వం నుండి కాంపర్షేషన్ తీసుకొని మాత్రమే ఇచ్చారని ప్రజలు గమనించాలన్నారు. నాడు మాజీ మంత్రి శిల్పామోహన్రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చంద్రబాబునాయుడును నంద్యాల అభివృద్ధికి 50కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరగా.. డబ్బులు చెట్లకు కాస్తున్నాయా అని నాడు చెప్పిన చంద్రబాబు మాటలను గుర్తు చేశారు. బైఎలక్షన్లో డబ్బులు కుమ్మరిస్తారు, అసత్యపు హామీలు ఇచ్చి పబ్బంగడిపారన్నారు. దుష్ప్రచారాలను టీడీపీ నాయకులు ఇకనైనా మానుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు గోరే, ముర్తుజా, లక్ష్మీనారాయణ, కిరణ్కుమార్, దండెదస్తగిరి, గోపాల్, జాకీర్, ఎర్రన్న, రెడ్ క్రాస్ సొసైటీ దస్తగిరి, ఓల్డ్ టౌన్ వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



# గో సంరక్షణతోనే సకల సంపదలు.

## -డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తి.తి.దే.

ఆంధ్ర ప్రగతి చాగలమరి జనవరి 20:
గోజాతి సంరక్షణ వలన సకల సంపదలు చేకూరుతాయని, నేల సారవంతమై, ప్రకృతి పులకరిస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా, చాగలమర్రి మండలం, మద్దూరు గ్రామంలోని స్వయంభూ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నందు జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్త మానవాళికి గోజాతి చేకూర్చేటంత ప్రయోజనం ఏ ప్రాణి చేకూర్చలేదని, అటువంటి గోజాతి సంరక్షణ ప్రతి పౌరుని బాధ్యత అని అన్నారు.ఇందులో భాగంగా ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాస్ చేసిన శ్రీమద్రామాయణ, మహాభారత, భగవద్గీతలపై ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు యం. రమణమ్మ దస్తగిరి, ఆలయ అర్చకులు మామిడి కిషోర్ శర్మ, మామిడి సాయి శ్రవణ్ శర్మ, భక్త మండలి సి.రమణయ్య, నాగేశ్వరరావు, ధర్మ ప్రచార మండలి సభ్యులు టి.వి.వీరాంజనేయరావు, ధర్మ ప్రచారకులు షరాబు శంకరాచారి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఈ నెల 27 న నంద్యాలలో రాయలసీమ నిజదర్శన దీక్ష.

## -ఈ నెల 27 న నంద్యాలలో రాయలసీమ సమస్యలపై దీక్ష.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 20:
రాయలసీమ సాగునీటి సమస్యల పరిష్కార మార్గాలపై మనస్సు పెట్టి ఆలోచన చేయక, రాయలసీమ సమాజాన్ని మభ్యపరుస్తున్న పాలక, ప్రతి పక్షాలు చర్యలను సమాజం ముందుంచే లక్ష్యంతో "రాయలసీమ నిజదర్శన దీక్ష" ను చేపట్టామని రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు వై.యన్.రెడ్డి, ఉప్పలపాటి బాలీశ్వరరెడ్డి అన్నారు.శనివారం నంద్యాల సమితి కార్యాలయంలో "రాయలసీమ నిజదర్శన దీక్షకు " సంబంధించి కరపత్రాలను సమితి నాయకులు ఈ సందర్భంగా విడుదల చేశారు.ఈ సందర్భంగా వై.యన్.రెడ్డి మాట్లాడుతూ...తుంగభద్ర, కృష్ణా నదులలో నీరు ప్రవహిస్తున్నా, రాయలసీమకు చట్టబద్ధమైన నీటి హక్కులన్న ప్రాజెక్టులు నీరు పొందలేకపోవడానికి గల కారణాలను విశ్లేషించి, తగిన కార్యాచరణ చేపట్టడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాల్సిన ఈ కార్యక్రమాలను విస్మరించి, రాయలసీమ ఎత్తిపోతల పూర్తి అయ్యేవరకు / గోదావరి జలాలు మళ్ళించేంత వరకు ఆగండని మభ్యపరిచే కార్యక్రమాలు పాలక, ప్రతిపక్ష పార్టీలు చేపట్టాయని ఆరోపించారు. రాయలసీమలో న్యాయ రాజధాని అంటూ ఒకరు, సీడ్ హబ్/ఉద్యానవన పంటల హబ్ అంటూ ఇంకొకరు రాయలసీమ వాసులను మభ్యపరచడం ఇకనైనా నిలిపివేసి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం కల్పించిన హక్కుల సాధనకు కృషి చేయాలని విజ్ఞప్తి చేసారు.రాజ్యాంగం, బచావత్ ట్రిబ్యునల్, రాష్ట్ర విభజన చట్టం రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు కల్పించిన నీటి హక్కులకు తూట్లు పొడుస్తూ కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ 6, 2023 న తీసుకొని వచ్చిన చీకటి చట్టం రద్దుకై పోరాడాలని పాలకులకు, రాజకీయ పార్టీలను కోరుతున్నామని అన్నారు.
రాయలసీమ అభివృద్ధికి చెరువుల నిర్మాణం, పునరుద్ధరణ, పెన్నా నది పునరుజ్జీవనకు ప్రత్యేక సాగునీటి కమీషన్ ఏర్పాటుకు కృషి చేయాలని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేసారు. రాయలసీమ సాగునీటి వాస్తవ పరిస్థితికి అనుగుణంగా కార్యాచరణ చేపట్టాలని రాజకీయ పార్టీలకు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు.

రాయలసీమ ప్రగతికై చేపట్టే "రాయలసీమ నిజదర్శన దీక్ష" లో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సమితి నాయకులు ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత ఎజియమ్ శివనాగిరెడ్డి, మహమ్మద్ పర్వేజ్, భాస్కర్ రెడ్డి, కొమ్మా శ్రీహరి, శివరామిరెడ్డి, పట్నం రాముడు, క్రిష్ణమోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ జూపల్లె గోపాల్ రెడ్డి, రాఘవేంద్రగౌడ్, షణ్ముఖరావు, సుదర్శన్, నిట్టూరు సుధాకర్ రావు పాల్గొన్నారు.

# బలిజలు అన్ని రంగాల్లో రాణించాలి.

## - ఈ ఎన్నికల్లో బలిజల సత్తా ఏమిటో చూపుదాం.





ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ జనవరి 20:
బలిజ మహా సంకల్పం రాజ్యాధికార సన్నాహక ఆత్మీయ సమావేశాన్ని శనివారం స్థానిక సమంత కాంప్లెక్స్ అహోబిళం మెయిన్ రోడ్డు వద్ద బలిజ సంఘం నాయకులు, ఆర్రౌ కన్స్ట్రక్షన్ లిమిటెడ్ అధినేత, ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి విజయకుమార్,అడ్వకేట్ పత్తి సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పసుపులేటి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సమావేశానికి బలిజ కులస్తులందరూ తరలివచ్చి విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలిజలు ఆర్థికంగా, రాజకీయంగా, విద్య, అన్ని రంగాల్లో ఎదిగేందుకు తీసుకోవాల్సిన ప్రణాళికలు, చర్యలపై చర్చించారు. ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించగలమని చెప్పారు.రాష్ట్ర జనాభాలో అత్యధికంగా బలిజలు ఉన్నారని, ఎన్నికల సమయంలో బలిజలను ఓట్ల కోసం రాజకీయ నాయకులు వాడుకుని వదిలేస్తున్నారని చెప్పారు. ఈసారి ఎన్నికల్లో బలిజలకు ఎమ్మెల్యే, ఎంపి టికెట్స్ కేటాయించే పార్టీలకే తమ సంపూర్ణ మద్దతు తెలుపుతామని చెప్పారు. పిల్లలను బాగా చదివించడంలోనూ, ఆర్థికంగా రాణించడంలోనూ ముందుండాలన్నారు.ఈ ఎన్నికల్లో బలిజల సత్తా ఏమిటో చూపుదామన్నారు. బలిజ కులస్థులదరూ ఈ ఆత్మీయ సమావేశానికి తరలిరావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు సంజీవ రాయుడు, కోనేటి వెంకటేశ్వర్లు, బద్రి సుబ్బరాయుడు, డాక్టర్ ఎం వి ప్రసాద్, సిద్ధి సత్యం, పత్తి బ్రహ్మయ్య, గురప్ప, అంగం శివ రాయల్, గుత్తి నరసింహులు, కొల్లం పుల్లయ్య, ఆకుల నడిపి వెంకటసుబ్బయ్య, దంతర రమణ, జనసేన రాము, వాస్తు వీరయ్య, గ్రాంతి శ్రీను, తుమ్మల కాంతు, బలిజ సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# చట్ట సభలలో ముస్లిం మైనార్టీల స్థితిగతులపై గళం వినిపించేదెవరు?

ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు జనవరి 20:
ఆత్మకూరు ముస్లిం అంజుమన్ వెల్ఫేర్ సొసైటీ కమిటీ అధ్యక్షులు నూర్ బేగ్ గారు మాట్లాడుతూ

ఆంధ్రప్రదేశ్ లో ముస్లిం సామాజిక వర్గం 55 నుండి 60 నియోజకవర్గాలలో గెలుపును శాశించే స్థాయి మరియు 25 అసెంబ్లీ స్థానాలలో గెలిచే సత్తా సత్తా ఉంది.

అయినా ఆంధ్రప్రదేశ్ లో ఉన్న ఇరు పార్టీలు కేవలం ఐదు లేదా ఆరు స్థానాలు ఇస్తున్నారు.

వైయస్సార్ పార్టీ అధ్యక్షులు జగన్ గారికి మరియు తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు చంద్రబాబు గారికి మా ముస్లింసామాజిక వర్గనికి చెందిన వారిని కనీసం 25 మంది ఎమ్మెల్యే అభ్యర్థులుగా అవకాశం ఇవ్వాలని మా అంజుమన్ ద్వారా కోరుచున్నాము.

కర్నూలు ఉమ్మడి జిల్లాలో అన్ని పార్టీలు ముస్లిం సామాజిక వర్గానికి ఒక ఎంపీ, నాలుగు ఎమ్మెల్యే అభ్యర్థులు కేటాయించాలి. ఆంధ్రప్రదేశ్ ముస్లిం సామాజిక వర్గము జనాభా సుమారు 80 లక్షల దాక గలదు. ముస్లిం సమాజం అభివృద్ధి పొందాలంటే విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి. యస్.సి., యస్.టి. బి.సి., సామాజిక వర్గాలకంటే విద్యా, ఉద్యోగము, ఉపాధి, రాజకీయ రంగాలలో ముస్లింలు ఎంతో వెనకబడి వున్నారు. ఈ విషయము ప్రభుత్వ గణాంకాల ద్వార వెల్లడవుతుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వార ముస్లిమేతర సామాజిక వర్గాలు ఎంతో కొంత అభివృద్ధి సాధించినప్పటికినీ ముస్లింల పట్ల వివక్ష, నిర్లక్ష్యము, దుష్ప్రచారము వలన ఏ రంగాలలో కూడా వాటా కల్పించక పోవడం వలన ఇతర సామాజిక వర్గాలకంటే ముస్లింలు అన్ని రంగాలలో చాలా వెనకబడిపోయారు. ముస్లింలలో నాయకత్వపు లోపం పలురంగాలలో తగినంత ప్రాతినిధ్యం లేనందున ముస్లింల సమాజం నిరాశా నిస్పృహలతో దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తుంది.

ముస్లింలు అనేక వృత్తులలో ఇమిడి కఠిక దారిద్రాన్ని అనుభవించుచున్నారు.

1) జస్టిస్ రాజేంద్ర సచార్ కమిటి నివేదికను అమలు చేయాలి.
2) జస్టిస్ రంగరాథ్ మిశ్రా కమీషన్ ప్రకారము 10% రిజర్వేషన్ ఇవ్వాలి.
3) ఉపాధి:- చిన్న మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు ప్రోత్సహించాలి.
4) ముస్లింలలో సన్నకారు, చిన్నకారు రైతులు ఎక్కువ కాబట్టి దీర్ఘకాలిక రుణాలిచ్చి వారి వ్యవసాయ అభివృద్ధి కోసము సహకరించాలి.
) ఉచిత భూపంపిణి ప్రభుత్వము పంపిణీ చేయాలి
6) మూకోన్మాదుల దాడులు నుంచి రక్షణ
7) ముస్లిం, దళిత మహిళలపై జరిగే అత్యాచారాలు, మైనార్టీ దళితుల పై జరిగే దాడులను అరికట్టుట
8) ముస్లిం సంక్షేమ దృష్ట్యా జనాభా ప్రాతిపదికన బడ్జెటు కేటాయించిన సబ్ ప్లాన్ అమలు చేయాలి.
9) ముస్లిం విద్యార్థి, విద్యార్థినిలకు స్కాలర్షిప్పులు అందరికి అందజేయాలి. ఫీజు రీయెంబర్స్మెంట్ యివ్వాలి.
10) పేద ముస్లిం అమ్మాయి పెండ్లికి దుల్హన్ పథకము రూ.1,00,000/- ఒక లక్ష రూపాయలు యే షరతులు లేకుండా అమలుజేయాలి. యస్.యస్.సి. సర్టిఫికేట్తో నిమిత్తం లేకుండా ఇవ్వాలి.
11) మత కలహాలకు తావివ్వకుండ యస్.సి., యస్.టి. చట్టములాగ ముస్లింలకు రక్షణకోసం చట్టము తేవాలి.
12) ఉర్దూ భాషను రెండవ అధికార భాషగా అమలు చేయాలి.
13) జాతీయ మైనార్టీ కమీషన్ నిధులు సక్రమంగా ఉపయోగించుకొనెట్లు చేయాలి రాష్ట్రీయ మైనార్టీ కమీషన్ కూడా సద్వినియోగము కావాలి.
14) వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించాలి, అన్యాక్రాంతమయిన వాటికి సమాన విలువగా చెల్లించి ఇకపై అన్యాక్రాంతానికి గురి కాకుండా చట్టాన్ని కఠినతరము చేయాలి.
15) చట్టసభలలో ముస్లిం సమస్యల పరిష్కార చర్చకోసం రాజ్యాంగాధినేత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి మార్గములో ముస్లింలకు రాజ్యాధికారం కోసం జనాభా దామాషా ప్రకారంగా ప్రాతినిధ్యము కల్పించాలి.
16) విదేశి విద్య సౌలభ్యం ఉన్నత చదువు కోసం ముస్లిం మైనార్టీ విద్యార్థిలకు ప్రభుత్వం ద్వార ఆర్థిక సహాయం (గతంలో ఉన్న సౌలభ్యాన్ని కొనసాగించాలి)
17) ఇస్లామిక్ బ్యాంక్ వడ్డీరహిత ఆర్థిక సహకారం కోసం బ్యాంకు ఏర్పాటు అయితే చిన్న, మధ్య తరగతి మైనార్టీ వ్యాపారులకు సహాయ సహకారాలు అందించుటకు గతంలో పాలనను అందించిన పార్టీలు తమ మ్యానిఫ్యాస్టోలో ప్రకటిస్తున్నాయి. కాని వాటి ఆచరణ పట్ల శ్రద్ధ చూపుట లేదు.
18) గురుకుల పాఠశాలలు ముస్లిం మైనార్టీలకు ఉర్దూ రెండవ అదికార భాషగా ఆచరణ నిమిత్తం తెలుగు/ఉర్దూ రెండు భాషల ప్రావీణ్యత కోసం గురుకుల పాఠశాలలు నిర్వహించి ఉర్దూను రెండవ భాషగా ప్రాధాన్యమివ్వాలని మనవి.
19) ఇమామ్లకు, మౌజన్లకు ప్రభుత్వం ద్వార ఉచిత గృహాలు నిర్మిస్తామని ఉచిత హామీలు గుప్పించకుండా, ఉచిత గృహ పథకం అమలు చేయాలి, ఉచిత గృహాలకోసం ప్రభుత్వం స్థలం ఇచ్చి స్వంత ఇంటి కలను నిజము చేయలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో అంజుమన్ కమిటీ సభ్యులు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా, సయ్యద్ మోటార్ షఫీఉల్లా, షఫీ, నబి రసూల్, మున్వర్ బేగ్, అబ్దుల్ హుస్సేన్, నజీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా అంతటా వంద శాతం కుల గణన సర్వే ప్రక్రియ మొదలు కావాలి

## - ఈ నెల22 వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురణ:-జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు, జనవరి 20:-

జిల్లా అంతటా వంద శాతం కుల గణన సర్వే ప్రక్రియ మొదలు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఎంపిడిఓ లు,మునిసిపల్ కమిషనర్ లను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం జిల్లా అధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్ లు, ఎంపీడీఓ లు, తదితరులతో కుల గణన సర్వే, ఎలక్షన్స్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 19 వ తేదీన ప్రారంభించిన కుల గణన సర్వే 10,496 క్లస్టర్ లకు గాను 6,685 క్లస్టర్ లలో సర్వే ప్రారంభించగా ఇంకా 3,811 క్లస్టర్ లలో అథెంటికేషన్ తదితర కారణాల రీత్యా సర్వే మొదలు పెట్టలేదని, పెండింగ్ లో ఉన్న క్లస్టర్ లలో సర్వే వెంటనే ప్రారంభించే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత మండలాల ఎంపిడిఓ లను కలెక్టర్ ఆదేశించారు.. ఆదోని అర్బన్, ఎమ్మిగనూరు అర్బన్ లాంటి మండలాలలో 90 శాతం కంటే ఎక్కువ క్లస్టర్ లలో సర్వే మొదలయిందని,కృష్ణగిరి, ఆలూరు, ఎమ్మిగనూరు, వెల్దుర్తి, పత్తికొండ, పెద్దకడబూరు, ఆదోని, చిప్పగిరి, తుగ్గలి, కౌతాళం, కర్నూలు, గూడూరు అర్బన్ , హొళగుంద మండలాలో మాత్రం 50 శాతం కంటే తక్కువ క్లస్టర్ లలో కుల గణన సర్వే మొదలయిందని సంబంధిత మండలాల ఎంపిడిఓ లను ప్రశ్నించారు. ఈ రోజు సాయంత్రం 6 గంటలకు ఎట్టి పరిస్థితులలోనూ 100 శాతం క్లస్టర్ల సర్వే మొదలుపెట్టాలని కలెక్టర్ ఎంపిడిఓ లను ఆదేశించారు.. కుల గణన సర్వేకి సంబంధించి జనవరి 28 వ తేది చివరి తేది కనుక కుల గణన సర్వేకి కేటాయించిన సిబ్బంది సెలవు దినాల్లో కూడా సర్వే పనులు చేసి జనవరి 28 వ తేది నాటికి 100 శాతం సర్వే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించిన తుది ఓటర్ల జాబితా 22 వ తేది ఉదయం ఈఆర్వో, ఏఈఆర్ఓ, బిఎల్ఓ లు పోలింగ్ స్టేషన్ల వారీగా, ప్రతి తహశీల్దార్, ఎంపిడిఓ, ఈఆర్ఓ కార్యాలయాలలో, ముఖ్యమైన ప్రదేశాలలో తుది ఓటర్ల జాబితా ప్రదర్శించి, అందుకు సంబంధించిన అక్నాలెడ్జ్మెంట్ పంపించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.. అలాగే ప్రోటోకాల్ ప్రకారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు అందరికీ తుది ఓటర్ల జాబితా అందచేసి, అక్నాలెడ్జ్మెంట్ తీసుకోవాలన్నారు. అదే విధంగా 22 వ తేది మధ్యాహ్నం తుది ఓటర్ల జాబితా పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలన్నారు.. దరఖాస్తు లకు సంబంధించి డిస్పోస్ చేసిన ప్రతి దరఖాస్తుకు డాక్యుమెంటేషన్ ఉండాలన్నారు.. ఈవీఎం డెమోన్స్ట్రేషన్ అన్ని నియోజక వర్గాల్లో పెద్ద ఎత్తున జరగాలని, జరిగినట్లుగా మీడియా లో కూడా రావాలన్నారు.. ఈ నెల 27 వ తేదీ లోపు ప్రతి పోలింగ్ స్టేషన్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.. నాడు నేడు కింద లేని పోలింగ్ స్టేషన్ లకు ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీస్ ద్వారా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. టెలి కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ్ తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్, పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి తదితరులు పాల్గొన్నారు..





# అంగన్వాడీల నిరవధిక సమ్మెను ప్రభుత్వం సామరస్యంగా పరిష్కరించాలి.

## -40వ రోజు రాస్తారోకో కార్యక్రమం .

ఆంధ్ర ప్రగతి డోన్ జనవరి 20:

అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న సమ్మెను ప్రభుత్వం సామరస్యంగా పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం,జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మాణిక్యం శెట్టి, సిఐటియు మండల అధ్యక్ష,కార్యదర్శులు పి.రామాంజనేయులు,ఏవి.భాస్కర్ రెడ్డి,పట్టణ అధ్యక్షులు నక్కీశ్రీకాంత్,యుటిఎఫ్ జిల్లా సీనియర్ నాయకులు అబ్దుల్ లతీఫ్ డిమాండ్ చేశారు.రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఎదుట గల దీక్షా శిబిరం నుండి అంగన్వాడీలు రైల్వే స్టేషన్ మీదుగా ర్యాలీగా వెళ్లి అమ్మ హోటల్ సర్కిల్ నందు గంటకు పైగా రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 40 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్నారని ప్రభుత్వంలో చలనం రాకపోవడంతో సమ్మెను ఉదృతం చేస్తూ నాలుగు రోజుల నుండి అంగన్వాడి రాష్ట్ర నాయకత్వం ప్రాణాలకు తెగించి విజయవాడ నడిబొడ్డులో ఆమరణ నిరాహార దీక్షలు చేస్తున్నారని వారికి ఏదైనా జరగరానిది జరిగితే ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించవలసి వస్తుందని హెచ్చరించారు.ప్రభుత్వ బెదిరింపులకు అంగన్వాడీలు భయపడరన్న విషయాన్ని మొండి ప్రభుత్వం ఇప్పటికైనా గ్రహించాలని అన్ని పార్టీలు,ప్రజా సంఘాలు,అన్ని వర్గాల ప్రజల మద్దతు అంగన్వాడీలకు ఉన్నదని పరిస్థితులు చేయి దాటకముందే సమ్మెను సామరస్యంగా పరిష్కరించాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కిహరి,ఎస్ఎఫ్ఐ కార్యదర్శి అశోక్,ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు రహమద్బి,సుమలత,ఆదిలక్ష్మి,రామలక్ష్మి,వరలక్ష్మి,విజయలక్ష్మి,నాగలక్ష్మి,మాధవి,సువర్ణ, టి.లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

# రహదారి భద్రతా మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించండి:-జిల్లా కలెక్టర్ డా.జి.సృజన

కర్నూలు, జనవరి, 20 : రహదారి భద్రతా మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించి వాహనదారులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన రవాణా శాఖ అధికారులను ఆదేశించారు.శనివారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో రహదారి భద్రతా మాసోత్సవాలకు సందర్భంగా పోస్టర్లను, కరపత్రాలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి భద్రతా మాసోత్సవాలకు భాగంగా జనవరి 20వ తేది నుంచి ఫిబ్రవరి 19తేది వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. వాహనదారులు మితిమీరిన వేగంతో ప్రయాణించకూడదన్నారు. మోటారు యాక్ట్ చట్టం సెక్షన్ 129 ప్రకారం వాహనదారులు వాహనాలు నడిపేటపపుడు హెల్మెట్ ధరించాలి లేని యెడల సెక్షన్ 177 ప్రకారం జరిమానా విధించడం జరుగుతుందన్నారు. వాహనానికి సంబంధించిన లైసెన్సులు తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అదే విధంగా కారులో ప్రయాణించే వారు డ్రైవర్ తో సహా అందరూ తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని, కారు నడిపే సమయంలో ఫోన్ ఉపయోగించకూడదన్నారు. సిగ్నల్స్ ను అనుసరించి నియమ నిబంధనలు పాటించని పాదచారులకు రోడ్డున దాటే అవకాశం కల్పించేలా వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు.కార్యక్రమంలో డిటిసి శ్రీధర్ రెడ్డి, ట్రాఫిక్ డిఎస్పీ నాగభూషణం, ఆర్టీవో రమేష్, డిఎంహెచ్ఓ రామగిడ్డయ్య, ఆర్ అండ్ బీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# వైసిపికి సూపర్ షాక్.. టిడిపి లోకి 50 కుటుంబాలు.



ఆంధ్ర ప్రగతి బండి ఆత్మకూరు జనవరి 20:

బండి ఆత్మకూరు మండలం నారాయణాపురం గ్రామంలో అధికార వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తలిగింది. వైసిపి నాయకులు కంపమల్ల వెంకట సుబ్బయ్య ( గృహ సారథి ), షేక్ నబి రసూల్ ( 4వ వార్డు సభ్యులు ), ఆలమూరు మురళి ( మాజీ విద్యా కమిటి చైర్మన్ ), బంగి శ్యామల ( వార్డు సభ్యులు ), మాడుగుల రమేష్, పెద్ద రమణ లతో పాటు మరో 50 కుటుంబాలు శనివారం వేల్పనూరు లోని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి గారి నివాసంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బుడ్డా కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

# అన్ని దారులు అయోధ్య వైపే.. అంతా రామమయం..!

ప్రపంచంలోనే 3వ అతి పెద్ద (భారత్‌లో అత్యంత పెద్ద) హిందూ దేవాలయంగా నిలుస్తున్న అయోధ్య మందిరాన్ని 'శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్' ఆధ్వర్యంలో 'ఎల్ అండ్ టీ'తో పాటు 'టాటా కన్సల్టెన్సీ' సంస్థలు చేపట్టిన అయోధ్య రాముడి ఆలయం 54,700 చదరపు అడుగుల విస్తీర్ణంలో 2.7 ఎకరాల్లో నిర్మించడం, 70 ఎకరాల ప్రాంగణం కోట్లాది హిందు భక్తులకు ఆహ్వానం పలకనుంది. భవ్య ఆలయ నిర్మాణానికి 4 లక్షల ఘనపు అడుగుల అరుదైన రాజస్థానీ పింక్ మార్బుల్ బన్సీ పహర్‌పూర్ శిలలను వినియోగించారు. అయోధ్య రాముడు కొలువుండే మందిరం 360 అడుగుల పొడవు, 235 అడుగుల వెడల్పు, 161 అడుగుల ఎత్తు ఉండేట్లు నిర్మించారు. చీఫ్ ఆర్కిటెక్ట్ చంద్రకాంత్ భాయి సోంపురా సలహాలతో 'నగర శైలి'లో వాస్తు సూత్రాలకు లోబడి రామమందిరా నిర్మించారు.

దేవాలయ ప్రత్యేకతలు

తూర్పు ప్రధాన ద్వార గోపురం ఆహ్వానం పలుకగా అష్టభుజాకృతిలో ఉన్న ఆలయంలోని గోడలు రాముడి జన్మ విశేషాల చిత్రాలతో అబ్బురపరచనున్నాయి. ఐదు గోపురాలతో పాటు 161 అడుగుల ఒక టవర్‌తో 3 అంతస్థుల్లో నిర్మించిన ఆలయ గర్భ గుడిలో కొలువైన రామయ్యపై సూర్య కిరణాలు సోకనుండడం పరమాద్భుతమైన అంశంగా తోస్తున్నది. గృహ మందిరం, కీర్తన మందిరం, నృత్య మందిరం, రంగ్ మందిరం, రెండు ప్రధాన మండపాలు కూడా ఆలయంలో నిర్మించారు. రామమందిరంలో పురాతన శ్రీరాముడి విగ్రహంతో పాటు పెద్ద సైజ్‌లో ఉన్న రాముడి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఆలయంలో రూ: 21 లక్షలు వెచ్చించి 6 అడుగుల ఎత్తు, 5 అడుగుల వెడల్పు ఉన్న 2,100 కిలోల బరువైన గుడి గంటను తయారు చేశారు. శతాబ్దాల పాటు పూజలందుకోనున్న ఆలయ నిర్మాణానికి మహారాష్ట్ర చంద్రాపూర్ నుంచి సేకరించిన టేకు కర్రలతో ఆలయ ద్వారాలు తయారు చేశారు.

వెయ్యేండ్లకు పైగా భక్తులకు అందుబాటులో..

వెయ్యేండ్లకు పైగా జీవితకాలం కలిగిన ఆలయంలో ప్రతి రోజు లక్ష వరకు భక్త కోటి దర్శనం చేసుకోనున్నారు. రామ మందిర నిర్మాణంలో ఎలాంటి ఐరన్, స్టీల్ వాడకపోవడం ఓ విశేషం. భక్తుల సౌకర్యార్థం అత్యాధునిక శ్రీరామ్ విమానాశ్రయం, రైల్వే స్టేషన్, జాతీయ రోడ్డు మార్గాలు నిర్మించారు. యూపీ రాష్ట్రానికే ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్న రామ మందిరం భారతీయ హృదయ స్పందనగా, పరమత సహనానికి చిహ్నంగా, శాంతియుత సహజీవన సూత్రాలను బోధించే ఆధ్యాత్మిక కేంద్రంగా, సనాతన భారతీయత ప్రతిబింబించే పుణ్య స్థలంగా, హిందూ ధర్మ ప్రచార వేదికగా నిలువనుండడం ఆనందదాయకం. 24 జనవరి 2024 నుంచి భక్తుల సందర్శనకు మందిరం సిద్ధంగా ఉంది. శ్రీరాముడిని కనులారా దర్శించుకొని, మనసులో నింపుకొని, రాముడి బోధనలను ఆచరిస్తూ హిందుత్వ సుగంధాలను విశ్వ వ్యాపితం చేద్దాం

హిందూ బంధువుల ఆనందోత్సాహాలు

'శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర' ఆధ్వర్యంలో నిర్మించిన దివ్యమైన భవ్య అయోధ్య రామమందిరానికి అఖండ భారతం నుంచి మాత్రమే కాకుండా విదేశీ పరమత భక్తులు నుంచి కూడా విరాళాలు వెల్లువెత్తడం హిందూ భక్తకోటికి అమితానందాన్ని కలిగించింది. జనవరి 15, 2021 నుంచి దేశవ్యాప్తంగా నిర్వహించిన విరాళాల సేకరణ ఫిబ్రవరి 27, 2021 వరకు నిరాటంకంగా కొనసాగింది. హిందూస్థాన్ ఉత్తరం నుంచి దక్షిణం, తూర్పు నుంచి పడమరకు ఊరూరా రామ భక్తులు తమకు తోచిన విరాళాలు స్వచ్ఛందంగా భక్తితో సమర్పించుకోవడం జరిగింది. రామ మందిర నిర్మాణం కోసం భారతదేశంలోని 4 లక్షలకు పైగా గ్రామాలు, పట్టణ ప్రాంత వార్డుల్లోని దాదాపు 100 మిలియన్ల కుటుంబాల నుంచి విరాళాలు సేకరించారు. హిందూ బంధువులే కాకుండా రామ భక్త ముస్లిమ్ సొసైటీ, ఇతర మతస్తులు కూడా పెద్ద ఎత్తున విరాళాలు ప్రకటించడం భారత హిందూ ఏకీకరణ జరిగి, భిన్నత్వంలో ఏకత్వం సాధించినట్లు నిర్ధారణ అయ్యిందని నిర్వాహకులు తెలిపారు.

కోట్ల కొద్ది విరాళాల వెల్లువ

నిరుపేదలు, యాచక వర్గాల నుంచి అత్యంత సంపన్నుల వరకు ప్రతి ఒక్కరూ తమకు తోచిన నగదును (10/- నుండి కోట్ల రూ?ల వరకు) భక్తితో సమర్పించి శ్రీరాముని దీవెనలు పొందారు. ఈ విరాళాల సేకరణలో 9 లక్షల కార్యకర్తలు 1.75 లక్షల జట్లుగా ఏర్పడి, ఇంటింటికీ వెళ్లి నగదును స్వీకరించారు. సేకరించిన నగదును 38,125 కార్యకర్తలు పారదర్శకంగా బ్యాంకుల్లో జమ చేయడం జరిగింది. హైదరాబాద్?కు చెందిన ధనుష ఇన్ఫోటెక్ కంపెనీ సమన్వయ పరిచిన యాప్ సహాయంతో విరాళాల సేకరణకు దేశవ్యాప్తంగా 49 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసింది. అఖండ హిందూస్థాన్‌లో అరుణాచల్ నుంచి రూ: 45 మిలియన్లు, మణిపూర్ నుంచి 20 మిలియన్లు, తమిళనాడు నుంచి 850 మిలియన్లు, కేరళ నుంచి 130 మిలియన్ల నగదును సేకరించడం జరిగింది.'సోమ సూర్యులు, సురలు, తారలు, ఆ మహాంబుధులు, అవనీ చంద్రులు... అంతా రామమయం' అంటారు భద్రాచల రామదాసు. ప్రస్తుతం ఆసేతు హిమాచలం రామ నామస్మరణతో మారుమోగుతోంది. భారత దేశమంతా ఓ ఆధ్యాత్మిక భావనలో తేలుతున్న, ఈ తరం చూస్తున్న మొదటి పండుగ ఇది.

దేశంలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయన్నింటికీ సోమవారం ఉదయం ఒంటిపూట సెలవు ప్రకటించారు. అయోధ్యకు నిలయమైన ఉత్తర ప్రదేశ్ కూడా 22నాడు పబ్లిక్ హాలీడేగా డిక్లేర్ చేసింది. భాజపా పాలిత రాష్ట్రాలన్నీ సోమవారం మధ్యాహ్నం వరకూ ఒంటిపూట సెలవుగా నిర్ణయించాయి. స్టాక్ మార్కెట్లన్నీ కూడా మధ్యాహ్నం రెండున్నర గంటల తర్వాతే తెరుచుకుంటాయి. ఇండిగో ఫ్లయిట్‌లో ప్రయాణిస్తున్న వారంతా 'రామ్ ఆయేంగే' (రాముడు వస్తున్నాడు) అనే పాటను పాడుతున్న దృశ్యం వైరల్ అయింది. ఆ దృశ్యాన్ని భారత ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచారు.

ఇక రామ మందిర ప్రతిష్ట ఉత్సవాలు 16 నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 22న రాముడి విగ్రహ ప్రతిష్టాపనతో వేడుకలు పూర్తవుతాయి. విగ్రహ ప్రతిష్టాపన సమయంలో గర్భగుడిలో ప్రధాని మోదీ, ఉత్తర ప్రదేశ్ గవర్నర్ ఆనందీ బెన్ పటేల్, సీఎం యోగి ఆదిత్యనాథ్, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్, మందిరం ప్రధాన పూజారి సత్యేంద్రదాస్‌లు మాత్రమే రాముని వద్ద ఉంటారు. శుక్రవారం రాముని విగ్రహాన్ని గర్భగుడిలో స్థాపించారు. విగ్రహం కళ్లకు గంతలు కట్టారు. ప్రతిష్టాపన సమయంలో కళ్లకు గంతలు విప్పిన తర్వాత ముందుగా మోదీ, ఆ గర్భగుడిలో ఉన్న వారంతా దర్శించుకుంటారు.23 నుంచి ప్రజలు రాముని దర్శించుకోవచ్చు